ABN
ఆంధ్రజ్యోతి

నాలుగేళ్ల డిగ్రీ ప్రపంచీకరణలో భాగమే!

ఎస్. గోవిందరాజులు జూన్ 15న ఆంధ్రజ్యోతిలో రాసిన 'నాలుగేళ్ల డిగ్రీ: విద్యా ఉన్నతికేనా?' వ్యాసంలో రాష్ట్ర ప్రభుత్వాలు మూడు సంవత్సరాల స్నాతకపూర్వక (అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీ) విద్యావ్యవస్థలో చేస్తున్న సమూల మార్పుల వలన విద్యోన్నతి జరగదని, గతంలో డిగ్రీలో ఉన్న ప్రమాణాలు, విద్యార్థులు ఎంపిక చేసుకొనే విద్యా విభాగాల(సబ్జెక్టులు) మధ్య ఉండే అనుబంధాన్ని తెగ గొట్టి, తర్క రహితమైన విద్యావిభాగాల ఎంపికకు తెరలేపటానికి దారి తీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా 'ఇంటర్న్‌షిప్'తో పిల్లలను బయట తిప్పటం వలన పరోక్షంగా కార్పొరేట్ వ్యవస్థలకు ఉచితంగా ఊడిగం చేయటానికి ఇదో దొడ్డిదోవ ఏర్పరచటం అని కూడా వ్యాఖ్యానించారు. నిజానికి ఐదు దశాబ్దాల క్రితం ఈ వాదనలకు ఆధారమైన విద్యాభ్యాసం, శిక్షణ ఉండేది. దాని ఫలితాలు చవిచూసిన వారికి ప్రస్తుతం విద్యా రంగంలో వస్తున్న మార్పులపై వారు వ్యక్తం చేసిన భావాల్లాంటివి ఉండటం ఎంతో సహజం. ఆనాటి సమాజం కోరుకొన్నది 'జ్ఞాన లేదా విజ్ఞాన' ప్రధానమైన విద్య. ఆనాడు తమ పిల్లలు బాగా చదువుకొని, ఉన్నత చదువులకు వెళ్లి, పరిశోధనలు చేసి దేశానికి, కుటుంబానికి పేరు ప్రఖ్యాతులు తేవాలని ఇటు తల్లిదండ్రులు, అటు ఉపాధ్యాయులు కోరుకొనేవారు. నేటి సమాజం వృత్తి (ప్రొఫెషన్), వృత్తి విజ్ఞాన (టెక్నాలజీ) ప్రధానమైంది. రెండు తరాలు (తరం అంటే పాతికేళ్ళు అనే ఒక లెక్క ఉంది) మారేటప్పటికీ సమాజ ప్రాధామ్యాలు మారిపోతున్నాయి. ఈ నేపథ్యంలో నేడు స్నాతక పూర్వక విద్య 'నాలుగేళ్లు' చేయటం ప్రపంచీకరణలో భాగంగా అనివార్యం అయింది. అదెలాగో వివరించటమే ఈ వ్యాసం ప్రధాన లక్ష్యం.

గత ఐదు దశాబ్దాల కాలంలో అన్ని రంగాలతో బాటు విద్యారంగంలోనూ తీవ్రమైన మార్పులు చోటు చేసుకొన్నాయి. క్లుప్తంగా కొన్ని వివరిస్తాను. నాడు సరైన ప్రమాణస్థాయి లేకపోతే, విద్యార్థులను తరువాత తరగతికి పంపేవారు కాదు. ఇది ఒకటవ తరగతి నుంచి పూర్వ ఎస్ఎస్ఎల్‌సి వరకు ఏక రీతిగా ఉండేది. దీనిని డిటెన్షన్ విధానంగా వ్యవహరించేవారు. నేడు ఈ ప్రమాణం పాటించటం లేదు. నాడు మార్కులు ప్రమాణంగా ఉండేవి. కానీ విద్యలో 'ప్రైవేట్ రంగం' ప్రవేశించాక, 'ప్రైవేట్ చదువులు', 'ట్యూషన్లు' అంటూ విద్యార్థుల, తల్లిదండ్రుల మార్కుల వ్యామోహాన్ని 'పెట్టుబడి'గా మార్చుకోవడం 1970వ దశకంలోనే ఆరంభమవటంతో కొద్దికొద్దిగా విద్యా ప్రమాణాలకు గండి పడటం మొదలయింది. పైగా ప్రామాణిక మార్కులు రానివారిని పై తరగతికి పోకుండా ఆపేసే పద్ధతి వలన సమాజంలో 'విద్యను ఆపేసే' (డ్రాపౌట్స్) వారి సంఖ్య పెరిగింది. ఒకటవ తరగతిలో వంద మంది చేరితే పదవ తరగతికి పాతిక మంది పిల్లలు కూడా చేరకపోవడంతో డిటెన్షన్ పద్ధతి ప్రభుత్వాలకి ప్రధాన సమస్య అయింది. దీనిని పరిష్కరించటం తక్షణ ప్రాధాన్యమైంది. అందుకు బదులుగా 1964 కొఠారి కమిషన్ రిపోర్ట్ ఆధారంగా ఏడూ, పది తరగతులకు ప్రామాణిక స్థాయిలు నిర్ణయించి అక్కడ ఉత్తీర్ణులైన వారినే పై తరగతులకు పంపటం సరైనదని భావించారు. అంతటితో ఈ డిటెన్షన్ పద్ధతికి స్వస్తి పలికారు.

గ్రామీణ స్థాయిలోను, తాలూకా స్థాయిలోను బడుగువర్గాల పిల్లలను స్కూలుకు తేవటం అప్పట్లో గగనమయ్యేది. 'ఎందుకు చదవాలి? చదివితే ఏమి లాభం? అదే పనికి వెళ్తితే మాకు కుటుంబం గడుస్తుంది' అనే వాదన ఎదుర్కోవటం అంత సులువు కాదు. నాటి ఉపాధ్యాయుల పరిస్థితులు కూడా అంతంత మాత్రమే. ఏడవ తరగతి కాని, ఎనిమిదవ తరగతి ఉత్తీర్ణులైన వారికి సెకండరీ గ్రేడ్ టీచర్ ట్రైనింగ్ ఇచ్చి ఉపాధ్యాయులుగా నియమించేవారు అతి తక్కువ జీతానికి. తరువాతి కాలంలో ఉపాధ్యాయ వృత్తి నైపుణ్యం పెంచేందుకు డిఎడ్ అని బిఎడ్ అని పలు పాఠశాల విద్యా విభాగాల బోధనలో నైపుణ్యం పెంపొందించే విద్యావ్యవస్థలను విస్తృతంగా అందుబాటులోకి తెచ్చారు. దీని వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్యబోధనలో గణనీయమైన మార్పులు వచ్చిన మాట నిజం. డిటెన్షన్ విధానాన్ని ఏడవ తరగతి, పదవ తరగతిలో మాత్రమే ఉంచినవారు, 2009లో దానిని కూడా ఎత్తేశారు. 2008లో అటల్ బిహారి వాజపేయి ప్రభుత్వం రాజ్యాంగంలోని ప్రాథమికహక్కుగా విద్యను పరిగణించి 'పిల్లల తప్పనిసరి విద్యా హక్కు' చట్టం తెచ్చింది. దాంతో డిటెన్షన్ విధానాన్ని పూర్తిగా ఎత్తేశారు. అయితే గోవిందరాజులు పేర్కొన్నట్టు కేంద్రం ఏది చెబితే, రాష్ట్రం అది చేసే పద్ధతిలో విద్యావిధానం తోలుబొమ్మలాటలా మారిన మాట నిజం. కానీ, ప్రపంచం గుండ్రం అన్నట్టు తిరిగి 2020లో నూతన విద్యావిధానంలో 'డిటెన్షన్' పద్ధతి ప్రవేశపెట్టారు. ఇలా ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత పాఠశాలతో రాష్ట్ర ప్రభుత్వాలు, ఉపాధ్యాయులు కేంద్ర విద్యావిధానాలు నేటికీ ఆటలాడుతూనే ఉన్నాయి. చివరకు ప్రస్తుత ముఖ్యమంత్రి హయాంలో ఈ ఆటలు పరాకాష్ఠకు చేరాయి.

ఎప్పుడైతే విద్యారంగం ప్రపంచీకరణ దారి పట్టిందో, ఎప్పుడైతే చదువులు ప్రమాణాలతో సంబంధం లేకుండా కేవలం వృత్తి, ఉద్యోగ, వృత్తి విజ్ఞాన మార్గం పట్టాయో అప్పుడు గోవిందరాజులు లేవనెత్తిన విద్యాప్రమాణ విషయాలు పక్కకుపోతాయి, అప్రధానం అవుతాయి. కాబట్టి కాలాన్ని, మారుతున్న అభిరుచులను, వాణిజ్య ధోరణులను ఆపే శక్తి విమర్శకుల నుంచి ఎప్పుడో ఎగిరిపోయింది. వీలైనంతవరకు ఆ మారిన దానినే, మారుతున్న దానినే ప్రామాణీకరించడానికి ప్రయత్నం చేయటమే మనముందున్న దారి.

నేడు దేశవ్యాప్తంగా లోతుగా పాఠ్యాంశాలు చెప్పే అధ్యాపకులను నిరాశపరిచే పరిస్థితులు నెలకొన్నాయి. వారికి అవమానాలు తప్పటం లేదు. ఎక్కువ శాతం



స్నాతకపూర్వ విద్య గరిపే యాజమాన్య సంస్థలు పుట్టగొడుగుల్లా వచ్చాయి. వింత వింత పాఠ్యవిభాగాలను (కోర్స్ డిజైన్) రూపొందించమని అధ్యాపకుల మీద వత్తిడి తెస్తున్నాయి ఆ యాజమాన్యాలు. విశ్వవిద్యాలయాలలో పరిస్థితి అదే. సెల్ఫ్ ఫైనాన్సింగ్ పథకం కింద ఎన్ని కొత్త పాఠ్య విభాగాలను అయినా కళాశాల యాజమాన్యాలు అమలు చేయవచ్చు. వాటికి అనుమతి సులువుగా ఇచ్చే కమిటీలను అనుబంధ విశ్వవిద్యాలయాలే ఇస్తాయి. ఇక్కడ ప్రమాణాలకు తావులేదు. యాజమాన్యాల వద్ద డబ్బు ఉంటే ఎన్ని కోర్సులనైనా ఏర్పరచుకోవచ్చు. ఎంతమంది విద్యార్థులనైనా చేర్చుకోవచ్చు. ఇవి వృత్తి, వృత్తిజ్ఞాన సంబంధమైన కోర్సులు (పాఠ్యవిభాగాలు). ఈ పాఠ్య విభాగాలను బోధించే అధ్యాపకులకు యూజీసీ నిర్ణయించిన జీతాలు ఉండవు. ఈ నేపథ్యంలో కళాశాల స్థాయి బోధనలో గతంలో ఉండే కోర్సులు మారిపోయాయి. విద్యార్థి కోరుకొన్న కోర్స్ కాంబినేషన్‌ను యాజమాన్యాలు ఇచ్చేస్తాయి. అంటే ఒక విద్యార్థి లెక్కలు, సంగీతం, పెయింటింగ్ కోరితే ఇచ్చేస్తారు. ఇది ప్రపంచీకరణ వలన మనదేశానికి వచ్చిన 'కరోనా' లాంటిదే. కానీ నేటి తరం కోరుకొన్న వైవిధ్యం ఇచ్చే విధానం ఇది.

1970ల్లో అమెరికా, యూరోప్, ఆస్ట్రేలియాలో, చైనా వంటి ఆసియా దేశాల్లో ఉండే ఈ పద్ధతిని ఇప్పుడు మన దేశం దత్తత తీసుకొంది. ఒకప్పుడు, అంటే 45 సంవత్సరాల క్రితం, ఒక కళాశాల విద్యార్థి అవసరం ఉన్నా, నచ్చినా, నచ్చకపోయినా ప్రభుత్వ కళాశాలలో, అనుబంధ విశ్వ విద్యాలయం ఒప్పుకొన్న కోర్సులనే చదవాలి. ఇప్పుడు ఆ పరిస్థితి పోయింది. ఆనాడు కళాశాలల్లో సంగీతం, పెయింటింగ్, శిల్పకళ, డాన్స్ వంటివి నేర్చుకోవాలంటే బయట పండితులైన వారిని ఆశ్రయించవలసి వచ్చేది. ఇవాళ ఆ పరిస్థితి మారింది. ఇప్పుడు టైలరింగ్ నుంచి కంప్యూటర్ గ్రాఫిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ నుంచి చాట్ జిపిటీ, డేటా మైనింగ్, డేటా అనలిటిక్స్, కంప్యూటేషనల్ స్టడీస్, డిటిపి, ఫోటోషాప్, విడియోగ్రఫీ, ఎడిటింగ్, 2డి, 3డి అన్నీ ఒకే చోట లభిస్తాయి. అంతే కాదు, ఆ దేశాల్లో 12+4 విద్యావిధానం అర్ధ శతాబ్దం కిందే అమలులో ఉంది. ఇప్పుడు, అదే రీతిలో 1964 కొఠారి కమిషన్ పెట్టిన 10+2+3 విద్యావిధానం కూడా మారాలి. ఎందుకంటే నేటి విద్యావిధానం ప్రథమ లక్ష్యం 'వృత్తి' సాధించటం. చదువు కాగానే కళాశాల ఆవరణ నుంచే ఏదో ఒక సాధ్యమైన, కోరుకొన్న వృత్తిలోకి వెళ్ళిపోయి ఆర్థికంగా నిలదొక్కుకోవటం. ఒక్కోసారి విదేశాలకు ఉన్నత నైపుణ్యం కోసం వెళ్ళవలసి వస్తే వెళ్ళటం. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సులువుగా అమెరికా, ఇతర దేశాలకు వెళ్లగలగటానికి కారణం వారు చదివే బి.టెక్ లేదా బి.ఇ నాలుగేళ్ల కోర్సు అవడమే. అక్కడ ఒక్క సంవత్సరం మాస్టర్ కోర్సు చేస్తే చాలు వాళ్ళ భవిష్యత్తు మరో స్థాయిలో ఉంటుంది. అమెరికా లాంటి దేశాల్లో ఒక్క సంవత్సరం మాస్టర్స్, డాక్టోరల్ కోర్స్ ఒకేసారి కలిపి చదవవచ్చు. ఎప్పుడైతే విద్యా రంగం ప్రపంచీకరణ దారి పట్టిందో, ఎప్పుడైతే చదువులు ప్రమాణాలతో సంబంధం లేకుండా కేవలం వృత్తి, ఉద్యోగ, వృత్తి విజ్ఞాన మార్గం పట్టాయో అప్పుడు గోవిందరాజులు లేవనెత్తిన విద్యాప్రమాణ విషయాలు ప్రక్కకుపోతాయి, అప్రదానం అవుతాయి. కాబట్టి కాలాన్ని, మారుతున్న అభిరుచులను, వాణిజ్య ధోరణులను ఆపే శక్తి విమర్శకుల నుంచి ఎప్పుడో ఎగిరిపోయింది. వీలైనంతవరకు ఆ మారిన దానినే, మారుతున్న దానినే ప్రామాణీకరించడానికి ప్రయత్నం చేయటమే మనముందున్న దారి.

• డా. కొప్పరపు నారాయణమూర్తి